

రంజాన్ వేళలు

- ఇఫ్తార్ - గురువారం సాయంత్రం - 6.34
- సహర్ - శుక్రవారం ఉదయం - 4.51

మండుతున్న ఎండలు

- ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతల నమోదు
- రంగారెడ్డి జిల్లా మొగలిగిద్దలో 41.6 డిగ్రీలు
- రాబోయే మూడు రోజులు ఆరెంజ్ అలెర్ట్
- రాత్రివేళా పెరిగిన ఉష్ణోగ్రతలు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వేసవి ఆరంభంలోనే ఎండలు దారెత్తిస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఈ ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా మొగలిగిద్దలో 41.6డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో 41.2డిగ్రీలు, రెడ్డిపల్లిలో 41డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా తాండూరులో ఈ సీజన్‌లో అత్యధికంగా 40.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాకగా మర్పల్లిలో 40డిగ్రీలు, మేడ్చల్ జిల్లా అల్లాపూర్‌లో 39.5డిగ్రీలు, కుత్బుల్లాపూర్‌లో 39.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. వచ్చే మూడు రోజుల్లో రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగే ఆస్కారం ఉందని ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఏప్రిల్‌కు ముందే భానుడు భగభగమండుతుండడంతో ఈ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతలు ప్రారంభమైయ్యాయి. మరో వైపు రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పెరగడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో చాలా మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 30 నుంచి 31 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఉక్కపోత భరించలేక ఆరుబయట నిద్రిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ లేనట్లే!

- గడువు నాలుగు రోజులే
- విడుదల కాని మార్గదర్శకాలు



తాండూరు, మార్చి 27 : ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం విధించిన గడువు దగ్గరపడుతోంది. ఈనెల 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని సర్కార్ ప్రకటించింది. ప్రకటన బాగానే ఉన్నా ఈ స్కీమ్ ఎలా అమలు చేయాలి? ప్రస్తుతనున్న జీవో సర్క్యులర్‌లోని మార్గదర్శకాల్లో మార్పులు ఏమైనా చేయాలా? అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం కొత్త మార్గదర్శకాలు ఇవ్వాలంటే ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో అదిసాధ్యం కాదు. ఇంకా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా మూడు నెలలు ఆగాల్సిందే. వేలాదిగా దరఖాస్తు చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు స్పష్టత కోసం ఆగాల్సిందే మరి. లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద 2020లో వచ్చిన దరఖాస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి ఫిబ్రవరి 26న క్రమబద్ధీకరణకు అనుమతిస్తూ ప్రకటన చేసిన విషయం విదితమే. అప్పట్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని మున్సిపల్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్ శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. సీఎం ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించిన వేళ ఎన్నికల కోడ్ రాకతో అడ్డంకులు ఎదురయ్యాయి. ఈనెల లోపు ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమలులో మాత్రం అడ్డంకులతో గడువులోగా అమలవుతుందా? లేదా? అనే ఆందోళన నెలకొంటుంది. పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు జారీ రాకపోవడంతో ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తక్కువ వ్యవధిలో పూర్తి చేయాలంటే గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు సవరణ చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీలో జాప్యం జరిగింది. కాగా, దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన, సొమ్ము చెల్లించేందుకు నోటీసుల జారీ వంటి ప్రక్రియ చేపట్టాలంటే కనీసం 20 రోజుల గడువు కావాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ , మున్సిపల్ సిబ్బంది అంతా ఎన్నికల ప్రక్రియలో బిజీ అయిపోతారని, జూన్ మొదటి వారం వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రస్తుతం సరికాదని భావించిన ప్రభుత్వం ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి మార్గదర్శకాలు జారీచేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. దీంతో మూడు నెలలపాటు ఈ ప్రక్రియ వాయిదా పడినట్లే.

మున్సిపాలిటీ	దరఖాస్తులు
వికారాబాద్	3972
తాండూరు	12183
కొడంగల్	420
పరిగి	4178
మొత్తం	20,753

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 27: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐ ఓట్ ఫర్ షూర్ నినాదంతో పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి అలంపల్లి చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన 5కే రన్‌ను ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే13 న జరిగే పార్లమెంటు ఎన్నికల కోసం ఓటర్ కార్డులు సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తునామన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నేను తప్పక ఓటు వేస్తాను అనే కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రతి ఒక్కరికి ఓటు హక్కు పై అవగాహన కలుగుతుందని అన్నారు. కార్యక్రమములో స్వీప్ నోడల్ అధికారి ఏం.ఎ సత్తార్ , డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి 5కే రన్ ప్రారంభిస్తున్న నారాయణరెడ్డి, ఎస్పీ

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కొడంగల్: ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. బుధవారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులతో కొడంగల్‌లో కడా కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కొడంగల్ నియోజకవర్గంలో తాగునీటి సరఫరాపై బోరు వెల్స్, చేతి పంపుల గురించి సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకుని, పని చేయనివాటిని శనివారం లోపు మరమ్మతులు వినియోగంలోకి తేవాలన్నారు. మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, తాండూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు, ఆంజనేయులు, బాబు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మిషన్‌భగీరథ ఏఈలు పాల్గొన్నారు. కాగా జిల్లాలోని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో త్రాగునీటి సమస్య లేకుండా పక్కా ప్రణాళికతో ముందు కెళ్లాలని కలెక్టర్ తెలిపారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే మంజూరైన పనులు అన్ని పూర్తి చేయాలన్నారు.

జిల్లాలో మెడికల్ షాపులపై నియంత్రణ కొరవడింది. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని మెడికల్ షాపుల యజమానులు డాక్టర్లలా సలహాలు ఇచ్చి అడ్డగోలుగా మందులు ఇచ్చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని మెడికల్ షాపుల్లో యథేచ్ఛగా నకిలీ మందుల దందా సాగుతోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. హోల్‌సెల్ డ్రగ్ వ్యాపారులు.. మెడికల్ దుకాణాల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు తిలోదకాలిస్తూ తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వైద్యుడి చీటి(ప్రిస్క్రిప్షన్) లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం అధికారుల నిఘా పూర్తిగా కొరవడడంతో వారు ఆడిందే ఆటా.. పాడిందే పాటగా మారింది.



మెడికల్ షాపులు!

జిల్లాలో జోరుగా నకిలీ మందుల విక్రయాలు



- జిల్లాలో 380 మెడికల్ షాపులు
- ప్రిస్క్రిప్షన్ లేకున్నా అమ్మకాలు
- జనరిక్ మందులకూ బ్రాండెడ్ ధరల వసూలు
- నిఘా కరువు.. యథేచ్ఛగా దందా!
- సంఘం గుప్పిట్లో డ్రగ్స్ అధికారులు
- తూతూమంత్రంగా తనిఖీ

పరిగి, మార్చి 27 : కొందరు జ్వరం వచ్చిందనో...జలుబు చేసిందనో డాక్టర్ దగ్గరకు వెళ్లకుండానే నేరుగా మెడికల్‌దుకాణానికి వెళుతుంటారు. డాక్టర్ దగ్గరికి వెళితే రూ.100 నుంచి రూ.300వరకూ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. స్పెషలిస్టు డాక్టర్ అయితే రూ. 500 వరకూ ఫీజు తీసుకుంటున్నాడు. అంత ఫీజులు చెల్లించలేని పేదప్రజలు ఏదైనా మెడికల్ షాపునకు వెళ్లి అడిగితే ఓ గోలి లేదా టానిక్ ఇచ్చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మెడికల్ షాపుల యజమానులు డాక్టర్లలా సలహాలు ఇచ్చి మందులు అడ్డగోలుగా ఇచ్చేస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో రూపాయో.. ఐదు రూపాయాలో డాక్టర్ ఫీజులు తీసుకునే రోజులు పోయాయి. అయితే మెడికల్ షాపుల వాళ్లు ఇచ్చే మందులు అన్ని సరైనవేనా.. నకిలీలు ఉన్నాయా అంశాన్ని ఆలోచిస్తే మంచిది.! ఎందుకంటారా? జిల్లాలోని మెడికల్ షాపుల్లో యథేచ్ఛగా నకిలీ మందుల దందా సాగుతోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. హోల్‌సెల్ డ్రగ్ వ్యాపారులు.. మెడికల్ దుకాణాల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ తమ వ్యాపారాలను సాగిస్తున్నారు. హోల్‌సెల్ వ్యాపారులైతే మరింత బరితెగించి రిటైల్ దుకాణాలకు నకిలీ మందులను సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోల్‌సెల్ వ్యాపారులు మెడికల్ దుకాణాలకు ఇచ్చే ప్రతీ డ్రగ్‌పై బ్యాచ్ నంబరు ఉంటుంది. ఇలా రిటైల్ దుకాణాలకు ఇచ్చే సమయంలో బిల్లుపై పొందుపరిచిన బ్యాచ్ నంబర్, కొనుగోలుదాడికి ఇచ్చే బిల్లుపై రాసే బ్యాచ్ నంబరు కూడా ఒకే విధంగా ఉంటేనే సరైనవేనని నమ్మొచ్చు. కానీ రెండు బిల్లులపై వేర్వేరు నంబర్లు ఉండడంతో నకిలీ మందుల దందా కొనసాగుతుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఫార్మాసిస్టుల జాడేది?

జిల్లాలో చాలా మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టులు కనిపించడం లేదు. అనుభవం కోసం దుకాణాల్లో పని చేస్తూ వారే నిర్వాహకులుగా మారిపోతున్నారు. డీ-ఫార్మసీ, బీ-ఫార్మసీ చేసిన వారి ధ్రువీకణ పత్రాలకు ఏడాదికి కొంత మొత్తం చెల్లించి ఒప్పందం చేసుకుని అత్యధికంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. ధ్రువపత్రం ఉన్న వారి పేరిట అనుమతి తీసుకుని ఇతరులు దుకాణాలను నిర్వహిస్తుండడం గమనార్హం.





మెడికల్ షాపులోమందులు

నియంత్రణ కరువు...

వైద్యం పేరుతో వ్యాపారం చేసే కొన్ని కొన్ని హోల్‌సెల్ ఏజెన్సీలతోపాటు, మెడికల్ దుకాణాలపై ఔషధ నియంత్రణ విభాగం అధికారుల నిఘా పూర్తిగా కొరవడింది. జిల్లాలో 380 వరకు మెడికల్ దుకాణాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవి కాకుండా గ్రామాల్లో లైసెన్స్‌లు లేని దుకాణాలు కూడా వందకుపైగా ఉంటాయని అంచనా. అయితే ఎన్ని షాపులకు అనుమతి ఉంది. ఎవరు నిబంధనలు అతిక్రమిస్తూ మందులు విక్రయిస్తున్నారనే విషయంపై తనిఖీలు లేకపోవడం అక్రమాలకు ఊతమిస్తోంది. అయితే ప్రస్తుతం మందుల షాపుల యజమానులు మాత్రం జనరిక్ ఇచ్చి బ్రాండెడ్ మందుల ముసుగులో దోపిడీకి పాల్పడుతున్నారు. బ్రాండెడ్ మందులు విక్రయిస్తే రిటైలర్లకు సుమారు 18 నుంచి 20 శాతం లాభాలు వస్తుండగా, వాటి పేరుతో జనరిక్ మందులు అమ్మితే 70నుంచి 200ల శాతం లాభాలు గడిస్తున్నారు. జనరిక్, బ్రాండెడ్ మందుల నాణ్యతలో ఏలాంటి వ్యత్యాసం లేదని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వైద్యులు జనరిక్ సిఫార్సు చేయడం లేదు. ఒకే రకమైన మందుల్ని తయారు చేస్తున్న కొన్ని కంపెనీలు జనరిక్‌పై ఒక ధర, బ్రాండెడ్ మందులపై మరో ధర ముద్రిస్తున్నాయి. మరికొన్ని కంపెనీలు రెండు ధరలను ముద్రిస్తుండడంతో గందరగోళం నెలకొంది. దీంతో రెండు రకాల ముందులు ధరల్లో భారీ వ్యత్యాసం ఉంటుంది. ఉదాహరణకు ఓ కంపెనీ తయారు చేసిన పెంటోప్రోజోల్ పది మాత్రలకు బ్రాండెడ్ కంపెనీలో రూ.120లకు లభిస్తుండగా, జనరిక్‌లో రూ.20లకే లభ్యమవుతాయి.

ధరల్లో చాలా వ్యత్యాసం

ప్రొటీన్ పౌడర్ బ్రాండెడ్ రూ.150కి లభిస్తుండగా, జనరిక్‌లో రూ.25లకు లభిస్తుంది. ఎన్‌జైమ్ సిరప్ రూ.60లకు లభిస్తే, జనరిక్‌లో రూ.25లకు, ట్యాబ్లెట్ ఎసి నిజ్‌ప్లస్ బ్రాండెడ్‌లో రూ.50లకు లభిస్తుండగా, జనరిక్ షాపుల్లో రూ.10లకు లభిస్తుండడం గమనార్హం. అయితే జిల్లాలో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయని కారణంగా రోగులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో జనరిక్ మందుల ఏర్పాటు చేస్తే రోగులకు ప్రయోజనం కలగనుంది.

భారీగా వసూళ్లు

జిల్లాలో మెడికల్‌షాప యజమానులంతా కలిసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. దీంతో మెడికల్ షాపుల యజమానుల సంఘం నేతలు చెప్పిన విధంగా ఆ శాఖ అధికారులు నడుచుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లాలోని అన్ని మెడికల్‌షాపుల దగ్గర నుంచి నెలానెలా సంఘం నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కోషాపునకు నెలకు రూ.5 వేల చొప్పున మొత్తం జిల్లాలో నెలకు రూ.20లక్షల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందులో సగం డబ్బులు డ్రగ్స్ అధికారులకు, మిగతా డబ్బులు మెడికల్ షాపుల సంఘం నేతలు పంచుకుతింటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మామూళ్ల మత్తులో తూగుతున్న అధికారులు మెడికల్‌షాపుల అక్రమ దందా గురించి పట్టించుకోవడం లేదు. దీంతో మెడికల్ షాపుల యజమానులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది.

నిబంధనలు గాలికి..

వైద్యుడి చీటి(ప్రిస్క్రిప్షన్) లేకుండా ముందుకు విక్రయించొద్దనే నిబంధనను మెడికల్ షాపుల యజమానులు తుంగలో తొక్కుతున్నారు. నిరక్షరాస్యులు, గిరిజనులు, వృద్ధులు అవసరాలను ఆసరాగా చేసుకుని మెడికల్ దుకాణాల నిర్వాహకులు చీటి ఉన్నా, లేకున్నా అధిక మొత్తంలో డబ్బు గుంజుతున్నారు. కొందరు వ్యాపారులు ధనర్జనే ధ్యేయంగా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అడ్డగోలుగా మందులు విక్రయిస్తున్నారు. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులు సిబ్బంది కొరత పేరిట తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ షాపును నిర్వహించే ఫార్మాసిస్టు డ్రెస్‌కోడ్‌తో పాటు.. మందులు అందించే సమయంలో గ్లౌజులు వేసుకోవాలి. కొన్ని మందులను ఫ్రిజ్‌లో మాత్రమే భద్రపరచాలి. వైద్యుడి చీటి(ప్రిస్క్రిప్షన్) లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. వినియోగదారుడికి కచ్చితంగా మందుల వివరాలతో కూడిన బిల్లును ఇవ్వాలి. కానీ ఏదో ఒకటి రెండు మెడికల్ షాపుల్లో తప్పా మిగతా దుకాణాల్లో ఇది అమలు కావడం లేదనేది నగ్నసత్యం. పేదలకు అందుబాటులోకి రావాల్సిన జనరిక్ మందులను అధికారులు ఎందుకు ప్రోత్సహించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జనరిక్ షాపులు తెరిపించాలి



బ్రాండెడ్, జనరిక్ మందుల ఫార్ములా ఒక్కటే. అయితే జనరిక్ మందులు తక్కువ ధరలకు లభిస్తాయి. లాభాలు కూడా తక్కువగా ఉంటాయి. బ్రాండెడ్‌లో మందుల్లో వ్యాపారులకు ఎక్కువ లాభాలు ఉంటాయి. కాబట్టి జనరిక్ మందులు విక్రయించేందుకు ఇష్టపడరు. ప్రభుత్వం ప్రతి మండలం, గ్రామాల్లో జనరిక్ మెడికల్ షాపులను నిర్వహించేలా ప్రోత్సహించాలి.

- ఎం.నాగేశ్వర్, ఎం-ఫార్మ్, ఫార్మాసిస్ట్, పరిగి

ఎవరి ధీమా వారిదే!

- నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- గెలుపు కోసం హోరాహోరీ పోరు
- క్యాంప్‌ల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు



పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వెళ్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ ప్రతినిధి/ఆమనగల్లు/కొడంగల్, మార్చి 27 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 10 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల ముంగిట ఈ గెలుపు పార్టీలకు కొంత మైలేజీ ఇస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ ఉంది. ఈ ఎన్నిక ఆపార్టీకి నల్లేరుపై బండినడకలా ఉండాలి. కానీ కాంగ్రెస్‌లో చాలామంది స్థానిక ప్రజాప్రతినిధులు చేరారు. నోటిఫికేషన్ నాటికి బీఆర్ఎస్ బలం దాదాపు మూడు రెట్లు ఎక్కువ. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రకటన కాస్త ఆలస్యమైంది. ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డిని అభ్యర్థిగా పెట్టారు. అయితే కాంగ్రెస్ ముందుగానే తమ అభ్యర్థిగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, ఎంఎస్ఎన్ ల్యాబ్స్ డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డిని నిలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈనెల 6న మహబూబ్‌నగర్‌లో సభకు హాజరయ్యారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు చాలామంది కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ వెంటనే తమ ప్రజాప్రతినిధులను క్యాంప్‌లకు తరలించింది. ఖర్చుకు వెనకాడకుండా గోవా, కర్ణాటకలాంటి డెస్టినేషన్లకు పంపింది. కాంగ్రెస్ కూడా క్యాంప్‌లు పెట్టింది. అభ్యర్థులు ఆర్థికంగా బలవంతులే కావడంతో కొందరికి తాయిలాలిచ్చారు. ఇద్దరు అభ్యర్థులు రెండు క్యాంపుల్లోని వారికీ కూడా డబ్బులిచ్చారు. ఉమ్మడి జిల్లాలో 10 కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుంది. ప్రజాప్రతినిధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటారు. గోవా క్యాంప్‌లోని వారితో కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వెళ్లి మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు కూడా వారి క్యాంపుల్లో పాల్గొన్నారు. గొడవలు జరగకుండా జిల్లాలో అందుబాటులో ఉన్న మొత్తం పోలీసు సిబ్బందిని బందోబస్తుకు వినియోగించనున్నారు. కాగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టించుకోలేదనే కోపం ఉన్నందున ఇప్పుడు ఆపార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తాయనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ క్రాస్ ఓటింగ్‌పైనే ఆశలు పెట్టుకుంది.

1,439 మంది ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 1,439 మంది ఓటర్లు ఉన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో 245 మంది ఓటర్లు, కొడంగల్‌లో 56 మంది, నారాయణపేటలో 205 మంది, వనపర్తిలో 218 మంది, గద్వాలలో 225 మంది, కొల్లాపూర్‌లో 67 మంది, నాగర్‌కర్నూల్‌లో 101 మంది, అచ్చంపేటలో 79 మంది, కల్వకుర్తిలో 72 మంది, షాద్‌నగర్‌లో 171 మంది తమ ఓటు వేస్తారు. మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, షాద్‌నగర్‌లో ఎంపీడీవో కార్యాలయాల్లో, వనపర్తిలో ఆర్డీవో కార్యాలయంలో, గద్వాలలో జడ్పీ మీటింగ్ హాల్‌లో, కొల్లాపూర్ బాలికల జూనియర్ కళాశాలలో, అచ్చంపేట బాలికల పాఠశాలలో, నాగర్‌కర్నూలులో బాలుర పాఠశాలలో, కల్వకుర్తిలో జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముగ్గురు అభ్యర్థులు పోటీపడున్నారు. ఏప్రిల్ 2న కౌంటింగ్‌తో ఫలితం తేలనుంది. కాగా ప్రతీ బూత్ వద్ద కనీసం 100 మందికి తక్కువ కాకుండా పోలీసులను పెట్టనున్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి

శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు.


రూ.2.51లక్షల పట్టివేత

వాహనాల తనిఖీల్లో స్వాధీనం



నగదును చూపుతున్న మధుసూదన్‌రెడ్డి

షాదూరు, మార్చి 27: వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.2లక్షల 51వేలు పట్టుబడినట్లు చెన్‌గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం రంగారెడ్డిజిల్లా షాదూరు మండల పరిధిలోని మన్నెగూడ చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో కారులో రూ.2లక్షల51వేలు పట్టుబడ్డాయి. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న మాధవీలత

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు

కీసర, మార్చి 27: సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయ అధికారి మాధవీలత ఆధ్వర్యంలో బుధవారం భోగారం పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని తెలిపారు. సకాలంలో రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి ఆర్థికంగా రాణించాలన్నారు. భూసార పరీక్షలు చేసుకోవాలని, నేలకు పోషకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

దోమ, మార్చి 27: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామాల్లో మహిళా సంఘాల అభివృద్ధిపై జిల్లా అదనపు డీఆర్డీవో సరోజ, ఎంపీడీవో మహేశ్‌బాబు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. చిన్న సంఘాలు ఆర్థిక, సామాజికపరంగా ఎలా అభివృద్ధి చెందాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అ

మహిళా సంఘాల అభివృద్ధిపై సమావేశం


సమావేశంలో పాల్గొన్న డీఆర్డీవో సరోజ

ధ్యక్షురాలు జ్యోతి, డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం సురేశ్, సెర్ఫ్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే బీజేపీ లక్ష్యం


మాట్లాడుతున్న కొండా సంగీతారెడ్డి

వికారాబాద్, మార్చి 27 : మహిళలు అభివృద్ధి చెందాలన్నదే బీజేపీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి తెలిపారు. వికారాబాద్‌లోని ఓల్డ్‌గంజ్ ప్రాంతంలో ఉన్న రుద్రమదేవి సంస్థలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటే.. వారి కుటుంబం బలంగా ఉంటుందన్నారు. ప్రధాని మోదీ మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముద్రా పథకం ద్వారా మహిళలకు రుణాలు ఇస్తున్నారని తెలిపారు. వృత్తి నైపుణ్యంలో శిక్షణ కూడా ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మేలు జరగాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వికారాబాద్ శాటిలైట్ టౌన్ అనే మాట ఎన్నో ఏళ్లుగా వినిపిస్తున్న మాట అన్నారు. దీనికోసం ఇప్పటికే ప్రపోజల్ కూడా పెట్టారన్నారు. ఇది నిజం కావాలంటే అభివృద్ధి ఒకవైపు, కనెక్టివిటీ ఇంకోవైపు జరగాలన్నారు. అప్పుడు ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే ఐదో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని చెప్పారు. మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో రోజా

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఆమనగల్లు , మార్చి 27 : మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని, దాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ ఆమనగల్లు సీడీపీవో రోజా అన్నారు. బాలికలు, మహిళల రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాయని ఆమె చెప్పారు. పట్టణంలోని రైతు వేదికలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మాన అక్రమ రవాణా నిరోధంపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి సీడీపీవో రోజా, ప్రజ్వల తెలంగాణ టీం సీనియర్ ఫ్యాకల్టీ సురేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వయస్సు, లింగ బేధంతో సంబంధం లేకుండా స్వలాభం కోసం పలువురు మానవులను అక్రమ రవాణ చేస్తుండడం అమానుషమన్నారు. ఇలాంటి సంఘటనలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అనిల్, అంబర్‌సింగ్, మిథాలిరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సంగీతారెడ్డి

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి: సంగీతారెడ్డి

» ముచ్చింతల్‌లో ఇంటింటి ప్రచారం

చేవెళ్ల, మార్చి 27 : బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమని కొండా సంగీతారెడ్డి కోరారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని ముచ్చింతల్‌లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆయన గెలిస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పంట రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ



కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బక్కన్న యాదవ్


షాద్‌నగర్‌అర్బన్, మార్చి 27 : ప్రాథమిక సహకార సంఘాల్లో తీసుకున్న పంట రుణాలను చెల్లిస్తే, రైతులు వడ్డీ రాయితీని పొందొచ్చని షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు దారమోని బక్కన్న యాదవ్ చెప్పారు. బుధవారం షాద్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బక్కన్న మాట్లాడుతూ రైతులకు నాలుగు కోట్ల దీర్ఘకాలక రుణాలు, మూడు కోట్ల పంట రుణాలను ఇచ్చామని తెలిపారు. తీసుకున్న పంట రుణాలను సకాలం చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం మూడు శాతం రాయితీని ఇస్తుందని, మిగిలిన నాలుగు శాతం వడ్డీని మాత్రమే రైతులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా ఇస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు కామన్ సర్వీస్ సెంటర్‌ను బక్కన్న యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సంఘం కార్యదర్శి రఘునందన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురహరి, ప్రసాద్

బీజేపీకి గుణపాఠం తప్పదు

ఆమనగల్లు, మార్చి 27 : కేంద్రంలో నియంత, నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్ అన్నారు. రాష్టంలో పదేళ్ల అరాచక పాలన సాగించిన బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి తప్పదని ఆయన హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశం ఎంగళి ప్రసాద్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని ఆ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు బుద్దారం మురహరి హాజరయ్యారు. కార్మికుల సంక్షేమం, ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు, పార్టీ బలోపేతం గూర్చి చర్చించారు. ఈ సందర్భంగా మురహరి, ప్రసాద్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాహుల్ ప్రధాని కావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో నాయకులు సాయిబాబా, సుదర్శన్, శరణ్యారెడ్డి, శ్రీనివాసులు, నర్మదారెడ్డి, సైదులు, లక్ష్మన్ నాయక్, మాధవరెడ్డి, బాలకృష్ణ, శేఖర్, కృష్ణ, పాల్గొన్నారు.



కొడంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సన్మానం

బొంరాస్‌పేట్, మార్చి 27: కొడంగల్ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కోవ్వూర్ సంతోష్‌కుమార్‌ను గ్రామస్తులు సన్మానించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శ్రీనివాస్, అంజనేయు, నాగమణి, లక్ష్మి, ఆలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చిత్తరంజన్‌దాస్



చిత్తరంజన్ దాస్‌కు కండువా కప్పుతున్న మల్లు రవి

ఆమనగల్లు, మార్చి 27 : మాజీ మంత్రి జక్కుల చిత్తరంజన్‌దాస్ సొంత గూటికి చేరారు. బీజేపీకి రాజీనామా చేసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్ కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణల సమక్షంలో కాంగ్రెస్ నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తలకొండపల్లి మండలం సంఘాయిపల్లి సమీపంలోని ఆ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి ఫామ్ హౌజ్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ చేరిక జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున చిత్తరంజన్ పోటీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో అభివృద్ధిని కాంక్షించి ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రకటించారు. తన రాజీనామ పత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపినట్లు చెప్పారు. తనకు సహకరించిన కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలు ఈటల రాజేందర్, బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీసీ నాయకుడిగా చిత్తరంజన్ దాస్‌కు పేరుంది. 1985,1989లో రెండు పర్యాయాలు కాంగ్రెస్ తరపున ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1989లో నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌ను ఓడించి ఆయన జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. నాటి ప్రభుత్వంలో మంత్రి గా పని చేశారు. 2004లో కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ చైర్మన్‌గా సేవలందించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయనను పలువురు నాయకులు అభినందించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మిట్టపల్లి అంజయ్య, మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, మార్చి27 : బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రను చేపట్టనున్నట్లు బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లలో బీజేపీ ఏం చేసిందో ప్రజలకు తెలిపేందుకు నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రను చేపట్టబోతున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజా ఆశీర్వాద యాత్ర ద్వారా ప్రతి ఒక్కరికి తెలియజేస్తామన్నారు. ఈ యాత్ర శంషాబాద్ పరిధిలోని అమ్మపల్లి ఆలయం వద్ద ప్రారంభమై ప్రతి రోజు 10గ్రామాల్లో పర్యటించే విధంగా రూపకల్పన చేసినట్లు చెప్పారు. బీజేపీకీ ఓటు వేసి మోదీని మరో సారి ప్రధానిని చేయాలని ఓటర్లను కోరారు. సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రవియాదవ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, ప్రబాకర్‌రెడ్డి, భీమేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, వైభవ్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, రవియాదవ్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు అమ్మపల్లి నుంచి యాత్ర

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 'చేవెళ్ల ప్రజా ఆశీర్వాద యాత్ర'ను నేడు మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వస్తున్నారని, నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో?!

» ఆసరా కోసం ఆపన్నుల ఎదురు చూపులు

» రెండేళ్లుగా మంజూరు కానీ కొత్త పింఛన్లు

» పార్లమెంట్ ఎన్నికల తరువాతనైనా ఆశ నెరవేరేనా?



వికారాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కొత్త పింఛన్ల కోసం ఆపన్నులు ఎదురు చూస్తున్నారు. రెండేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఆసరా కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలతో పాటు ఏఆర్‌టీ, ఫైలేరియా, డయాలసిస్ రోగులకు కూడా ప్రభుత్వం నెల నెలా పింఛన్లు అందజేస్తూ ఆసరాగా ఉంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం అందించే ఆసరాతోనే కొందరు నిరుపేదలు ఇతరులపై ఆధారపడకుండా తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. కొందరికి నెలవారీ పింఛన్ వస్తేనే పూట గడుస్తుంది. మరికొందరికేమో మందులు, చిల్లర సామాన్లు తెచ్చుకోవడానికి ఆసరాగా ఉంటోంది. ఇలాంటి నిరుపేదలకు అండగా ఉండేందుకు గత ప్రభుత్వం ఆసరా పేరిట పింఛన్ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే రెండేళ్లుగా కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఎంతో మంది ప్రభుత్వం ఇచ్చే ఆసరా కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. కొత్త పింఛన్లు రాక.. పోషించే వారు లేక కొందరు దుర్భరమైన జీవనం కొనసాగిస్తున్నారు. వృద్ధులే కాకుండా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు కూడా ఆసరా పింఛన్లకు నోచుకోక మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో రెండేళ్ల నుంచి ఏడు వేల మందికి పైగా నిరుపేదలు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఆసరా పథకం కింద జిల్లాకు మొత్తం 1,11,503 పింఛన్లు మంజూరు కాగా, నెల నెలా రూ.27,01,90,448 పింఛన్ చెల్లింపులు చేస్తున్నారు. 2022, మార్చి వరకు అర్హులైన వారికి ప్రభుత్వం ఆసరా పింఛన్లు మంజూరు చేయగా, ఆ ఏడాది ఆగస్టు నెలనుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. ఆ తరువాత ఆసరా కోసం దరఖాస్తు చేసుకున్న వారు కొత్త ఆసరా పింఛన్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 1,11,503 మందికి ఆసరా ...

జిల్లాకు ప్రతినెలా ఆసరా పింఛన్ల రూపంలో 1,11,503 మంది లబ్ధిదారులకు రూ.27,01,90,448 ప్రభుత్వం మంజూరు చేస్తోంది. 41,982 మందికి వృద్ధాప్య పింఛన్లు, 12,703 మంది దివ్యాంగులకు, 50,092 మంది వితంతువులకు, 145 మంది చేనేత, 426 మంది గీత, 38 మంది బీడీ కార్మికులకు, 4,636 మంది ఒంటరి మహిళలకు, 1,180 మంది ఏఆర్టీ, 203 ఫైలేరియా, 98మంది డయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఆసరా ఫింఛన్లు అందజేస్తోంది. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వితంతువులకు, చేనేత, గీత, బీడి కార్మికులు, ఏఆర్టీ, ఫైలేరియా, డయాలసిస్ రోగులకు ప్రభుత్వం నెలనెలా రూ.2,016 అందజేస్తుండగా, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ అందజేస్తూ ఆసరా కల్పిస్తోంది.

ఎప్పుడు మంజూరు చేస్తారో...?!

జిల్లాలో కొత్తగా ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియక దరఖాస్తుదారులు మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియక ఆవేదన చెందుతున్నారు. ఆసరా కోసం దరఖాస్తు చేసుకున్న ఒకటి, రెండు నెలల్లోగా పింఛన్లు మంజూరు చేస్తే తమ కుటుంబాలను ఆదుకున్న వారవుతారని దరఖాస్తు చేసుకున్న పేదలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసరా పింఛన్ల కోసం గత ప్రభుత్వ హయాంలో కొందరు దరఖాస్తు చేసుకోగా, కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ప్రజావాణి కార్యక్రమాల్లో కూడా ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక నిరుపేదలు దిగాలు పడుతున్నారు. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుపై నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కల్యాణ మండపం నిర్మాణమెప్పుడో?



పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన కల్యాణ మండపం

కులకచర్ల, మార్చి 27: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని పాంబండపై కల్యాణ మండపం నిర్మాణ పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. శ్రీ రామలింగేశ్వరస్వామి సన్నిధిలో ప్రతీ సీజన్‌లో ఇక్కడ పెళ్లిళ్లు జరుగుతాయి. మండపం లేకపోవడంతో ఆలయ ఆవరణలోనే పెళ్లిళ్లు జరిపిస్తుంటారు. దాంతో ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అందులో రూ.10 లక్షలు ఆలయం కంట్రిబ్యూషన్ చేయగా దేవాదాయ శాఖ రూ.40 లక్షలు విడుదల చేసింది. సదరు కాంట్రాక్టర్ పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి బిల్లు రూ.28 లక్షలు తీసుకున్నాడు. నిర్మాణ పనులు గత 8 నెలలుగా పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో మండపం నిర్మాణం పూర్తికాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడి మండపం నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న బుద్దారం మురహరి, ఎంగళి ప్రసాద్

కంటి వైద్యశిబిరం విజయవంతం

కులకచర్ల, మార్చి 27: కులకచర్ల ప్రభుత్వాసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా.. 26 మందికి కంటి శుక్లాల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి వారిని రెఫర్ చేసినట్లు తెలిపారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేయడంతో పాటు భోజన సదుపాయాన్ని కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, మూడు రోజులపాటు ఆసుపత్రిలో సేవలు అందించి, అన్ని రకాల వసతులు కల్పించడం జరుగుతుందని వైద్యాధికారిణి మాధురి తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆప్తాల్మిక్ వైద్యుడు జవహర్, వైద్యసిబ్బంది యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత, జంగమ్మ, రమేశ్, శ్రీనివాస్, ప్రశాంత్, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు నర్సరీని సందర్శించిన డీఆర్డీవో

మేడ్చల్ టౌన్, మార్చి 27 : మండలంలోని పూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని డీఆర్డీవో సాంబశివరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం ముగిసేంత వరకు నర్సరీలోని మొక్కలకు సమయానుసారంగా నీరు పట్టాలని సూచించారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. నర్సరీలో ఉన్న సమస్యలను, ఇతర ఇబ్బందులను సిబ్బందిని, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాంబశివరావు

ప్రగతి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 27: పట్టణాలు, పల్లెల ప్రగతి కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. నేడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ షాద్‌నగర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, ఐఎన్‌టీయుసీ రాష్ట్ర నాయకుడు రఘు, బ్లాక్ కాంగ్రెస్ షాద్‌నగర్ అధ్యక్షుడు జి. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడతూ బీఆర్ఎస్ పాలనలో నిధులు, విధులు లేక స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగాఏ ఉండిపోయారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడే వారిని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు తిరిగి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఒక పారిశ్రామిక వేత్తగా ప్రజా సేవ చేస్తున్నారని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ లభిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎన్. నవీన్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ నుంచి జడ్పీటీసీగా గెలుపొంది, బీఆర్ఎస్ పార్టీలో చేరి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఎన్నికై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూరి బస్వం, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్‌గా ఎన్నికపత్రాన్ని అందుకుంటున్న పాండురంగారెడ్డి

ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్‌గా పాండురంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(ప్యాక్స్) చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏదుల్ల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా కంబాలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం శేరిగూడలోని సొసైటీ కార్యాలయంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి ధాత్రీదేవి ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లు ఎన్నికలో పాల్గొన్నారు. పాత చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ క్యామ శంకర్(బీఆర్ఎస్)లపై అవిశ్వాసంతో పదవి కోల్పోవడంతో ఈ ఎన్నిక నిర్వహించారు. ఫిబ్రవరి 22న అవిశ్వాసం పెట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చెందిన 11 మంది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌లకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే హైకోర్టు ఉత్తర్వులతో అప్పడు డీసీవో ఫలితాన్ని ప్రకటించలేదు. ఈ నెల 21న కోర్టు స్టే ఎత్తివేయడంతో కొత్త చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డిలకు డీసీవో ఎన్నిక పత్రాలను అందజేశారు.

రైల్వే లైన్ కోసం సర్వే

» తక్కళ్లపల్లి సమీపంలో హద్దులు వేసిన రైల్వే అధికారులు



యాచారం, మార్చి 27: యాచారం, కందుకూరు మండలాలకు రైల్వేలైన్ రానుంది. మూడు రోజుల క్రితం రైల్వే సర్వే బృందం రైల్వే లైన్ కోసం హద్దులు గుర్తించింది. యాచారం మండలం తక్కళ్లపల్లి-మేడిపల్లిల మధ్య రోడ్డు పక్కన రైల్వే అధికారులు హద్దులు గుర్తించారు. శంషాబాద్ నుంచి నల్గొండ జిల్లా నాంపల్లి ప్రాంతాలను కలుపుతూ రైల్వేలైన్ వేసేందుకు రైల్వే అధికారులు మార్కింగ్ చేశారు. నూతన రైల్వేలైన్ కోసం రైల్వే శాఖ పూనుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరం నుంచి ఏపీలోని మాచర్ల వరకు రైల్వేలైన్ వేయాలని యూపీఏ ప్రభుత్వంలో రైల్వేశాఖ సహాయ మంత్రిగా పనిచేసిన కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి జాతీయ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. రైల్వే లైన్ కోసం అప్పట్లో కోదండరెడ్డి పలుమార్లు కేంద్ర మంత్రులకు విన్నవించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ పనులకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామం అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



పొలాలకు దారి ఇవ్వాలని ఆందోళన చేస్తున్న రైతులు

మా పొలాలకు దారి ఇవ్వండి

కీసర, మార్చి 27: వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలంటూ పలువురు రైతులు బుధవారం కీసరలో ఆందోళన చేశారు. కీసర రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 131లో అటవీ శాఖ పరిధిలో స్థలం ఉంది. ఆ స్థలం వెంట కొన్నేళ్లుగా వ్యవసాయ పొలాలకు వెళ్తున్నామని, ఉన్నట్టుండి దారిని మూసేసి, అటవీశాఖ అధికారులు ఇనుప కంచెలతో ఫెన్సింగ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు ఫెన్సింగ్ తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీశాఖ పరిధిలో ఉన్న భూమికి ఫెన్సింగ్ వేయాలని ఆదేశాలు వచ్చనట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుకు బడ్జెట్ కూడా కేటాయించడం జరిగిందని, రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని లక్ష్మణ్ తెలిపారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి

'భగీరథ' రికార్డుల పరిశీలన

మేడ్చల్ టౌన్, మార్చి 27 : గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా చేసేందుకు చేపడుతున్న చర్యలు, వాటి తాలూకు రికార్డులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జ్యోతి పరిశీలించారు బుధవారం మండలంలోని రాజబొల్లారం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తనిఖీ నిర్వహించారు. గ్రామంలో మంచినీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న చర్యలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న మంచినీటి వివరాల రికార్డులను జ్యోతి పరిశీలించారు. నీటి సరఫరా పట్ల పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ మహేందర్, ఏఈ వసుధ, పంచాయతీ కార్యదర్శి రవీందర్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

● అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 27: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో మిల్లర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని, ఐకేపీ ఆధ్వర్యంలో 27, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 61, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 27, ఏఎంసీ ఆధ్వర్యంలో 3, ఇతర 4 మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రబీ 23-24లో 1,90,350 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని అంచనా వేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్యాడీ క్లీనర్, టార్పలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీడీఆర్ డీఏ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, వ్యవసాయాధికారి గోపాల్, శ్యాంరెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, సుగుణాబాయి, డీలర్లు బాలేశ్వర్ గుప్తా, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మంతట్టిలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బషీరాబాద్, మార్చి 27: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ పరిశీలించారు. మండలంలోని కాశీంపూర్, మంతట్టి, రెడ్డిఘణాపూర్, బహద్దూర్‌పూర్, కుప్పన్‌కోట్, గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్, కంసాన్‌పల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, ప్రహరీలు, మరుగుదొడ్లు, తదితర వసతుల విషయమై బూతులవారీగా పరిశీలన చేశారు. ఎన్నికలకు మరికొంత సమయం ఉన్నందున కలెక్టర్ ఆదేశానుసారం కేంద్రాల్లో వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్నమన్నారు. ఎక్కడైనా పోలింగ్‌కు అసౌకర్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆర్ఐ రాకేష్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



శామీర్‌పేట, మార్చి 27 : మండలంలోని తూంకుంటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా శ్రీమల్లికార్జునస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. యాదవ సంఘం కోరిక మేరకు బుధవారం తూంకుంటకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు కాసుల ఈశ్వర్‌గౌడ్ ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళం యాదవ సంఘం నాయకులకు అందజేసారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఈశ్వర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకుడు, మాజీ సర్పంచు దయాసాగర్‌యాదవ్, సంఘం నాయకులు రాజుయాదవ్, సుభాష్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిరంజన మఠంలో ఘనంగా ఆరాధనోత్సవాలు

కొడంగల్, మార్చి 27: కొడంగల్ పట్టణంలోని శ్రీ నిరంజన మఠంలో బుధవారం వీరశైవలింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బసవలింగేశ్వర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. కాశీ జగద్గురు వేద పాఠశాల-కిషన్‌నగర్, షాద్‌నగర్ పురోహితులు మల్లికార్జునస్వామి, మఠం విజయ్‌కుమార్, గడ్డం చంద్రశేఖర్, శ్రీశైల వేద పాఠశాలకు చెందిన మహేశ్‌కుమార్, వీరశైవలింగాయత్ సభ్యులతో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ లింగాయత్ సంఘం సభ్యులు, తాండూరు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న గురునాథ్‌రెడ్డి, తదితరులు

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

● పంచాయతీ కార్యదర్శులకు డీపీవో ఆదేశం

తాండూరు రూరల్, మార్చి 27 : ప్రస్తుత వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధారాణి కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం తాండూరు మండల పరిధిలోని బెల్కటూర్, కరన్‌కోట్ గ్రామాల్లో సుధారాణి పర్యటించారు. ఈ సందర్భంగా బెల్కటూర్‌లో శ్మశానవాటిక వద్ద ఉన్న బోరు మోటారు మరమ్మతులు చేయించాలని కార్యదర్శి పార్వతమ్మను ఆదేశించారు. గ్రామాల్లో అక్కడక్కడ నీటి కుళాయిల వద్ద ఆన్, ఆఫ్ సిస్టంలను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడేట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. పెన్నా సిమెంటు ఫ్యాక్టరీ ట్యాక్స్ రూ.6లక్షలు కట్టాల్సి ఉన్నా కేవలం రూ.లక్ష మాత్రమే ట్యాక్స్ కట్టడంపై డీపీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కరన్‌కోట్ గ్రామంలో డీపీవో పర్యటించారు. గ్రామంలో ఐదు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ వడ్డెర బస్తీలో ఉన్న వాటర్ ట్యాంకుకు పైప్‌లైన్ కనెక్షన్ లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆమె ఎదుట వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కార్యదర్శి ఆనంద్‌రావుకు డీపీవో సూచించారు. వందశాతం ఇంటి పన్ను వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయతీ అయిన కరన్‌కోట్ గ్రామంలో సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో రతన్‌సింగ్, మిషన్ భగీరథ ఏడీ ప్రతిభ, ఏపీవో నరోత్తంరెడ్డి, నాయకులు రాజ్ కుమార్, శరణబసప్ప ఉన్నారు.



తాండూరు రూరల్ : కరన్‌కోట్‌లో తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీపీవో సుధారాణి

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

బషీరాబాద్ : వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల వారీగా సమీక్షిస్తూ నీటి వనరులకు సంబంధించిన లెక్కలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ పంచాయతీల్లో ఎక్కడెక్కడా డైరెక్ట్ పంపింగ్ సిస్టం బోర్లు ఉన్నాయని, అందులో ఎన్ని పని చేస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు గ్రామాల వారీగా కార్యదర్శులను వివరాలు అడిగారు. ఎండలు ముదురుతున్నందున భూగర్భ జలాలు పడిపోయే అవకాశం ఉందని, నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నీటి వనరులన్నీ వర్కింగ్ కండీషన్‌లో ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా హ్యాండ్ బోర్లకు మరమ్మతులు చేయించి, పైపులైన్ లీకేజీలు సరిచేయించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో రమేష్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్ : కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో రాఘవులు

ఘనంగా ఎమ్మెల్యే సోదరుడి జన్మదిన వేడుకలు

బషీరాబాద్, మార్చి 27: ఎమ్మెల్యే సోదరుడు, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి బుయ్యని సత్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణుల మధ్య బషీరాబాద్‌లో బుధవారం జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పాత రైస్‌మిల్లు వద్ద మాజీ సర్పంచ్ పుడూరు ప్రియాంకశ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై ఎమ్మెల్యే సోదరుడిని శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణా అజయ్‌ప్రసాద్, పూడూరు తాజామాజీ సర్పంచ్ ప్రియాంకశ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు శంకరప్ప, అనూఫ్, రియాజ్, మణికంఠస్వామి, శ్రీకాంత్, నరేష్‌వాల్మీకి, శ్రీహరి కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు

అందరి సహకారంతోనే

సొసైటీ అభివృద్ధి

శామీర్‌పేట, మార్చి 27 : రైతుల, డైరెక్టర్లందరి సహకారంతో సొసైటీని గత మూడేళ్లుగా లాభాల బాటలోకి తెస్తున్నామని సొసైటీ ఛైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేటలోని వ్యవసాయదారుల సేవా సహకారం సంఘ భవనంలో ఛైర్మన్ అధ్యక్షతన ఆ సంఘం 41వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ శామీర్‌పేట రైతు సహకారం సంఘం గతంలో నష్టాల ఊబిలోకి వెళ్లిందని, అలాంటిదాన్ని తామెంతో శ్రద్ధ తీసుకుని డైరెక్టర్ల సహకారంతో అంచెలంచెలుగా నష్టాల నుంచి లాభాల బాటలోకి తెచ్చి అభివృద్ధి పరుస్తున్నట్లు వివరించారు. శామీర్‌పేటలోనే కాకుండా అలియాబాద్, మూడుచింతలపల్లి గ్రామాలను కూడా రైతుల సంక్షేమం కోసం రైతులకు అందుబాటులో గోదాములను, మందుల దుకాణాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా టీఎస్, జీఏబీ వారు పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో శామీర్‌పేట రైతు సహకార సంఘాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈప్రాజెక్టు కింద డ్రోన్ ద్వారా రైతుల వ్యవసాయ పంటలకు ఒక ఎకరానికి రూ.600లకే ఆధునాతన టెక్నాలజీతో మందులను స్ప్రే చేస్తున్నామని, రూ.365 చెల్లిస్తే రైతులకు పది రకాల మందులను అందజేస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం ద్వారా రైతుల కోరిక మేరకు వ్యవసాయ పంటల సాగుకు రుణాలను ఇస్తున్నట్లు తెలిపారు. సొసైటీ ద్వారా అందజేస్తున్న సేవలను రైతులు వినియోగించుకుని తద్వారా అభివృద్ధిని సాధించాలని ఛైర్మన్ పిలుపునిచ్చారు. అనంతరం శామీర్‌పేట రైతు సహకారం సంఘానికి చెందిన సభ్యులు పేరుపల్లి నర్సింహ మృతి చెందినందుకు ఆయన కుమారుడు లక్ష్మయ్యకు రుణమాఫీ కింద రూ.26,844లను ఛైర్మన్ మధుకర్‌రెడ్డి అందజేసారు. సొసైటీ వైస్‌ఛైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు, రైతులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ మధుకర్‌రెడ్డి

వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కులకచర్ల, మార్చి 27: సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరు కాని పలు శాఖల అధికారులపై చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. యాసంగిలో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులకు వివరించాలని సభ్యులు తెలిపారు. లాల్‌సింగ్ తండా పాఠశాలలో మన ఊరు, మనబడి పనుల్లో అక్రమాలు జరిగాయని, విచారణ చేపట్టాలని తిరుమలాపూర్ ఎంపీటీసీ రాంలాల్‌నాయక్ సభ దృష్టికి తెచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సంబంధిత అధికారులు కేంద్రాలను పర్యవేక్షించాలని కోరారు. మిషన్ భగీరథ నీరు గ్రామాలకు సరఫరా కావడం లేదని, వ్యవసాయ బోరు బావులను ప్రజలు ఆశ్రయిస్తున్నారని పలువురు సభ్యులు తెలిపారు. రోడ్డు ఉన్న ప్రతీ గ్రామానికి, గిరిజన తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్‌లు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతీ ఫిర్యాదును అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మొగులయ్య, ఎంపీడీవో రామకృష్ణ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల తహసీల్దార్‌లు మురళీధర్, ప్రభు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రమణ్యం, నాయబ్ తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంపీవో కరీం, ఎంఈవో హబీబ్ అహ్మద్, ఏపీయం శోభ, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఈసీ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మసీద్‌ను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

● సీఐ శ్రీధర్‌రెడ్డికి ఎంఐఎం నాయకుల ఫిర్యాదు

కొడంగల్ రూరల్, మార్చి 27: కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం కుదురుమళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి మసీద్‌పై దాడిచేసి మినార్‌ను ధ్వసం చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కే గుల్షన్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డికి ఎంఐఎం నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. కుదురుమళ్ల గ్రామంలో ఉన్న ఏకైక మసీద్‌పై ఉన్న మినార్‌ను దుండగులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ, పరిగి డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో దుండగులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు, ముస్లిం సోదరులు అబ్దుల్ కరీం, షేక్ రోమాన్, ఎండీ.సర్తాజ్ హుసేన్, ఎండీ.రహీం, ఎండీ.షేక్ అహ్మద్, ఎండీ.శంషీర్, ఎండీ.ముర్తజా, ఎండీ.అజహర్, ఎండీ.అబ్బు, ఎండీ.ఆమేర్, ఎండీ.ఫేరోజ్, ఎండీ.ఆబీద్, ఎండీ.అర్షద్, ఎండీ అలీం, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



సీఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఎంఐఎం నాయకులు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : శుభప్రద్

వికారాబాద్/శామీర్‌పేట, మార్చి 27 : మట్టిలో మాణిక్యాలను వెలికితీసే వారు ఉపాధ్యాయులని, ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. గురువారం స్థానిక కేబీఆర్ ఫంక్షన్ హాల్‌లో పీఆర్టీయూ తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలంపల్లి తెలుగు ఉపాధ్యాయులు కె.మారుతి పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ సామాజిక, తెలంగాణ ఉద్యమ కార్యక్రమాల్లో కూడా మారుతి కీలక భూమిక పోషించారన్నారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందు ఉందన్నారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకెశవరెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, అమరనాథ్, వివిధ మండలాల బాధ్యులు, వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షులు కె.శ్రీనివాస్, దేవదాస్, శాతవాహన సంఘం నాయకులు తదితరులున్నారు. శామీర్‌పేట మండలం లాల్‌గడీ మలక్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్రం ఉపాధ్యాయుడిగా గోపాల్‌కిషన్ పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ పొందారు. పాఠశాలలో ఆయన్ను శాసన మండలి మాజీ ఫ్లోర్‌లీడర్ జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, టీపీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీధర్, ప్రధానకార్యదర్శి వెంకటరాంరెడ్డి, గౌరవాధ్యక్షులు మోహన్‌రెడ్డి, కాప్రా మండలాధ్యక్షుడు మల్లేషం, శామిర్‌పేట మండలాధ్యక్షుడు వెంకటేశం, తదితరులు సన్మానించారు.



మారుతిని సన్మానిస్తున్న శుభప్రద్ పటేల్



గోపాల్‌కిషన్ దంపతులను సన్మానిస్తున్న జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

బీవీహెచ్‌పీఎస్ మండల కమిటీ

● నూతన అధ్యక్షుడిగా కొత్త జర్నయ్య

బంట్వారం(కోట్‌పల్లి), మార్చి 27 : భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి(బీవీహెచ్‌సీఎస్) నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన జర్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ప్రతీనెల ఇచ్చే ఆసరా పింఛన్లు ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగుల దివ్యాంగులకు ఉపాధి చూపించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కాగా, తనకు అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్‌కి జర్నయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పరిగి మండలాధ్యక్షుడు చంద్రయ్య, రామయ్య, సిద్ధి ఆనందం, నవనీత, బండి యశోద తదితర పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

తాండూరురూరల్, మార్చి 27 : ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ పేర్కొన్నారు. బుధవారం తాండూరు మండల పరిధిలోని అంతారం చెరువులో ఉపాధి హామీలో భాగంగా జరుగుతున్న పిచ్చిమొక్కల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, వారికి జాబ్ కార్డులు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఇస్మాయిల్

క్రైం కార్నర్

కోకట్ వాగు చెక్‌డ్యాంలో

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాలాల, మార్చి 27 : గుర్తుతెలియని శవం లభ్యమైన ఘటన బుధవారం యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కోకట్ వాగు చెక్ డ్యాంలో గుర్తుతెలియని శవం(38) లభ్యమైందని చెప్పారు. మృతదేహంపై బ్లాక్ కలర్ షర్ట్, చాక్లెట్ కలర్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గాయపడిన మహిళను గుర్తించిన పోలీసులు!

ధారూరు, మార్చి 27: ధారూరు సమీపంలోని ఒంటి మామిడి చెట్టు రోడ్డు మలుపులో మంగళవారం రాత్రి గాయాలతో పడివున్న మహిళను గుర్తించినట్లు ఎస్సై వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. గాయపడిన మహిళను మండల పరిధిలోని అవుసుపల్లి గ్రామానికి చెందిన ఇంటెంటా లక్ష్మీగా గుర్తించామని, ఆమె దినసరి కూలీ అని చెప్పారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించామని, ఆమె స్పృహలోకి రాలేదని తెలిపారు. హోలీ సందర్భంగా రెండు రోజులుగా కూలి పనికి వెళ్లలేదని చెప్పారు. మంగళవారం ధారూరులోని పిండిమరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి.. బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదని చెప్పారు. బంధువుల వద్దకు వెళ్లి ఉండొచ్చని కుటుంబీకులు భావించారని చెప్పారు. బుధవారం భర్త లక్ష్మయ్య మహిళను గుర్తుపట్టాడని, గాంధీలో చికిత్స పొందుతున్న లక్ష్మీ స్పృహలోకి వస్తేనే వాస్తవంగా ఏమిటనేది తెలుస్తుందని ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదని, పూర్తి విచారణ చేసిన తర్వాతనే కేసు నమోదు చేస్తామని ఎస్సై వేణు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు

మేడ్చల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో లోకసభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి టోల్‌ఫ్రీ నెంబరును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజల సౌలభ్యం కోసం 1800 425 2050 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నేరుగా ఈ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చున్నారు. 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నియమావళికి ఉల్లంఘించే వారి పట్ల తమకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చున్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా పయనించాలి

వికారాబాద్, మార్చి 27: విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకువెళ్లాలని పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ ఎస్. డేవిడ్ విల్సన్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీవిద్యార్థులందరికీ దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లోని వివిధ సబ్జెక్టుల్లో పీజీలు, న్యాయ పరిపాలన శాస్త్రాల అధ్యయనాలు, వాటి విధివిధానాలు ఎప్పుడు?ఎక్కడ? ఏ రకంగా పరీక్షలు నిర్వహిస్తారు? వాటికి విద్యార్థులు ఎలా ప్రిపేర్ కావాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఈ చర్చా కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వికారాబాద్ తాత్కాలిక ప్రిన్సిపాల్ చిన్న సోమన్న, కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ చెన్నయ్య, సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ డి.నారాయణరావుతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ డేవిడ్ విల్సన్

ఆ ఇద్దరు తప్పా.. అందరూ ఓకే!

మేడ్చల్ టౌన్, మార్చి 27 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బావా, బావమరిది(ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయన బావమరిది మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌రెడ్డి) తప్ప ప్రతీ ఒక్కరిని తమ పార్టీలో చేర్చుకోవటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని గుండ్లపోచంపల్లి కౌన్సిలర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాయిపేట శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తమ పార్టీలో చేరదలచిన వారిని కొందరు కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారన్న విషయాన్ని ఆయన శుక్రవారం తీవ్రంగా ఖండించారు. పదేళ్లుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆరాచకాలు చేసి.. భూకబ్జాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన నాయకులకు తప్ప అందరికీ కాంగ్రెస్‌లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు తమ పార్టీలో చేరుతున్నారన్న విషయాన్ని శ్రీనివాస్ యాదవ్ ఏకీభవించారు. 12మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉన్న తమ మున్సిపాలిటీలో.. రానున్న కాలంలో ఇద్దరే మిగిలి పోతారన్నారు. ఇప్పటికే 9మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువా కప్పుకోవటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విద్యావంతులు, మేధావులు ఉన్నారని.. వారు ప్రస్తుతం తమ పార్టీలో చేరటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పార్టీలో కొత్తవారిని చేర్చుకోవటానికి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. నియోజకవర్గంలోని అయా ప్రాంతాల నుంచి కాంగ్రెస్‌లో చేరదలచిన ఇతర పార్టీల నేతల గురించి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చర్చించిన అనంతరం పార్టీలో చేర్చుకోవటానికి అనుమతిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన బావమరిది శ్రీనివాస్ రెడ్డిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో చేర్చుకోరాదంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముక్తకఠంతో తమ పార్టీ అధిష్టానానికి వివరించినట్టు తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నుంచి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. సమీప కాలంలో బీజేపీ నుంచి కూడా తమ పార్టీలోకి పెద్దఎత్తున యువకులు రానున్నారని తెలిపారు.



శ్రీనివాస్

నాణ్యమైన కూరగాయలు, పండ్లకు డిమాండ్

వికారాబాద్, మార్చి 27 : సహజంగా పండించిన నాణ్యమైన కూరగాయలు, పండ్లకు మంచి డిమాండ్ ఉందని, మంచి ధర కూడా లభిస్తుందని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ రైతు వేదికలో నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్, నేచురల్ ఫార్మింగ్, ఉద్యాన శాఖ సహకారంతో ప్రకృతి, ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహజ వ్యవసాయాన్ని ప్రొత్సహించేందుకు పరం పరాగట్ కృషి వికాస్ యోజన కింద రైతులకు లబ్ధి చేకూర్చాలని నిశ్చయించిందని, రైతులు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి ఈ కార్యక్రమాలు చేపడితే లాభం పొందవచ్చన్నారు. జైవిక్ కేతి పోర్టల్ ద్వారా ఆర్గానిక్ పద్ధతిలో పండించే ఉత్పత్తులను రైతులు సొంతంగా విక్రయించవచ్చని వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి సత్తార్, అధికారులు కమల, అబ్దుల్ గఫూర్, అర్చన, విజయ్‌కుమార్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

సంతలో అంబలి కేంద్రం ఏర్పాటు

కొడంగల్, మార్చి 27: కొడంగల్ మున్సిపాలిటీలో బుధవారం జరిగిన సంతలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థం ప్రతీ ఏటా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. వేసవిలో వ్యాపారులకు, వినియోగదారులకు దోహదపడుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా సంతకు వచ్చేవారికి అంబలి కేంద్రం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పీఏసీఎస్ ఛైర్మన్ శివకుమార్‌గుప్త, జయతీర్థచారిలు అన్నారు.